నమస్తే తెలంగాణ

# నల్లగొండ




# రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతోంది..

## అన్ని రంగాల్లో కాంగ్రెస్ సర్కార్ విఫలం

**సిరిసిల్ల క్యాంపు కార్యాలయంపై దాడి రౌడీయిజానికి పరాకాష్ట**

**కేటీఆర్‌కు నోటీసులతో డ్రామాలు: మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి**





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, మే 27 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్నిరంగాల్లో విఫలమై అవినీతిలో మాత్రం అత్యంత ప్రగతిని సాధించిందని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ఇక రౌడీయిజం ఊహకందని విధంగా మారుతుందన్నారు. సిరిసిల్లలో కేటీఆర్ క్యాంపు కార్యాలయంపై దాడి దానికి పరాకాష్ట అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వడం, సిరిసిల్ల క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ మూకల దాడిని తీవ్రంగా ఖండించారు. నోటీసులిస్తే భయపడేవారెవరూ లేరన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కేటీఆర్ క్రేజ్ పెరుగుతుంటే రేవంత్‌రెడ్డికి ఏడుపు మొదలైందని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు ఇతర దేశాల ఆహ్వానం మేరకు కేటీఆర్ వెళ్తుండగా తట్టుకోలేపోతున్నారన్నారు. విదేశాలకు వెళ్లకుండా కేటీఆర్‌ను ఆపాలనే అక్కసుతోనే నోటీసులు, చిల్లర డ్రామాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. చిల్లర రాజకీయాలతో బీఆర్ఎస్ కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయలేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అభివృద్ధి సోయి లేదని, 18 నెలలైనా ఇంకా బీఆర్ఎస్ మీద ఏడుపు తగ్గలేదన్నారు. రాష్ట్రంలో రేవంత్ పాలనలో అవినీతి ఏ స్థాయిలో ఉందో ఆర్థిక మంత్రి చాంబర్ ఎదుట కాంట్రాక్టర్ల ధర్నా అందరికీ తెలియజేసిందేనని విమర్శించారు. అన్ని శాఖల్లో కమీషన్లే వాళ్ల ఎజెండాగా మారిందని ఆరోపించారు. ఏ మంత్రి ఎంత సంపాదించాలే, సీఎం సీటుకు ఎట్లా పోటీ పడాలే అన్న సోయి తప్ప మరొకటి లేదన్నారు. అభివృద్ధిని పక్కన పెట్టి దోచుకునే విషయంలో పోటీ పడుతున్నారని మండిపడ్డారు. అందాల పోటీలతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రపంచం ముందు తెలంగాణ పరువు తీసిండన్నారు. ఇక నేషనల్ హెరాల్డ్ కేసు విషయంలో ఈడీ చార్జిషీట్‌లో రేవంత్ పేరు ఉండటంతో మోదీని కలువడానికి వెళ్లాడని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌తో ఆ పార్టీ దోస్తీ ఎట్లుందో అర్థమవుతుందన్నారు. కేసీఆర్ కాళేశ్వరం ఎందుకు కట్టిండో కాంగ్రెస్‌కు అవగాహన లేదన్నారు. మన నీళ్లను చంద్రబాబు ఎత్తుకెళ్తుంటే సోయే లేదని ధ్వజమెత్తారు. సిరిసిల్ల ఘటన కాంగ్రెస్ నాయకుల చిల్లర చేష్టలకు నిదర్శనమని ఫైర్ అయ్యారు. చిల్లర చేష్టలు మానుకొని ఇకనైనా అభివృద్ధిపై దృష్టి సారిస్తే మంచిదన్నారు.

### వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు

# కేటీఆర్‌కు ఈడీ నోటీసులు

**మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్**



చందంపేట(దేవరకొండ), మే 27 : ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కుట్రపూరితంగా కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సీఎం కుటిల రాజకీయ క్రీడలో భాగంగానే ఏసీబీ నోటీసులు జారీ చేసినట్లు స్పష్టమవుతున్నదని అన్నారు.

ఎవరెన్ని ఇబ్బందులు పెట్టాలని ప్రయత్నించినా తట్టుకుని నిలబడిన చరిత్ర కేసీఆర్‌దని అన్నారు.

# రైతుబీమాకు రాంరాం..!


## ప్రీమియం చెల్లించని ప్రభుత్వం

**నిలిచిన బీమా చెల్లింపులు**

**ఎదురు చూస్తున్న 227 రైతు కుటుంబాలు**

**కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్న రైతులు**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబీమాకు మంగళం పాడిందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం ప్రీమియం చెల్లించక పోవడంతో బీమా చెల్లింపులు నిలిచిపోయాయి. జిల్లా వ్యాప్తంగా 227 మంది రైతులు బీమా కోసం దరఖాస్తు చేసుకున్నారు. నాలుగు నెలలుగా ఎదురుచూస్తున్నా.. ఇప్పటికీ రాలేదు. దీంతో రైతు కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




సూర్యాపేట, మార్చి 27 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల ముందు అధికారం కోసం ఆరు గ్యారెంటీలు, 420 పచ్చి అబద్ధాల హామీలు కోటలు దాటేలా ఇచ్చి సీటుపై కూర్చున్నాక ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నది. కొత్తవి అమలు చేయకపోగా బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేండ్ల పాటు అమలు చేసిన పథకాలను కూడా అమలు చేయడంలేదు. ఇప్పటికే అనేక పథకాలు నిలిచిపోయాయి. దేశానికి అన్నం పెట్టే రైతు ఏదేని కారణంతో అకాల మరణం సంభవిస్తే ఆ రైతు కుటుంబం రోడ్డున పడవద్దనే ఉద్దేశంతో నాటి కేసీఆర్ ప్రభుత్వం ప్రతి రైతుకూ ఉచితంగా రూ.5లక్షల బీమాను అమలు చేసింది. 2019లో ఈ పథకం ప్రారంభం కాగా 2024 వరకు జిల్లాలో వివిధ కారణాలతో మృతి చెందిన 3,577 మంది రైతు కుటుంబాలకు రూ.178.85 కోట్లు అందించి ఆదుకుంది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పథకానికి మంగళం పాడుతున్నట్లు కనిపిస్తున్నది. గత నాలుగు నెలలుగా జిల్లాలో 227 మంది రైతు కుటుంబాలకు బీమా చెల్లించడం లేదు. ప్రధానంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేండ్ల కాలంలో రైతన్నల శ్రేయస్సు కోసం చేయని కార్యక్రమం లేదు. స్వయానా రైతు అయిన కేసీఆర్ రైతులకు ఎలాంటి ఆపదలు రాకుండా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలతో దేశంలోనే రైతు ప్రభుత్వంగా కీర్తి మూటగట్టుకుంటున్నది. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ వృత్తులకు వేల కోట్ల రూపాయలు వెచ్చించి రైతులు, రైతు కూలీలకు కడుపునిండేలా చర్యలు చేపట్టారు. రైతన్నల శ్రేయస్సు కోసం అనేక కార్యక్రమాలు చేపట్టి వారి జీవితాలకు భరోసా కల్పించే నిమిత్తం ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా 2019లో రైతుబీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్రతి రైతుకూ బీమా మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తూ వారికి రూ.5లక్షల ఉచిత బీమా ప్రారంభించింది. బీమా పొందిన అనంతరం రైతు ఏ కారణం చేతనైనా మృతి చెందితే సదరు కుటుంబానికి కేవలం 10రోజుల వ్యవధిలో రూ.5లక్షలు ఎల్ఐసీ సంస్థ చెల్లిస్తుంది. రైతు బీమాకు దరఖాస్తు చేసుకుంటున్న రైతులకు గుంట భూమి ఉండి పట్టా పాసుపుస్తకం పొంది ఉన్నా.. రైతుగా పరిగణించి నాటి కేసీఆర్ ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని వర్తింపజేసింది. 2019 ఆగస్టులో ఈ స్కీం ప్రారంభం కాగా నాటి నుంచి 2023 వరకు కేసీఆర్ ప్రభుత్వం ఒక్కో రైతుకు రూ.3,200ల చొప్పున బీమా చెల్లించింది. అలా 2019 నుంచి కేసీఆర్ ప్రభుత్వం ఉన్నంత వరకు జిల్లాలో వివిధ కారణాలతో మృతి చెందిన 3,577 మంది రైతు కుటుంబాలకు రూ.178.85 కోట్లు అందించి ఆదుకుంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ స్కీం కూడా నిలిచిపోతుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### 227 కుటుంబాలకు అందని రైతుబీమా

**గత** నాలుగు నెలలుగా జిల్లాలో వివిధ కారణాలతో మృతి చెందిన రైతు కుటుంబాలకు బీమా సొమ్ము రాలేదు. రైతుబీమా ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుంచి జూలై 30 వరకు కొనసాగనుండగా ముందే ప్రభుత్వం ప్రీమియం చెల్లించి రెన్యువల్ చేయాల్సి ఉంటుంది. అలా 2023లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం చెల్లించిన బీమా ప్రీమియంతో అదే సంవత్సరం డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో 2024 ఆగస్టు వరకు రైతుబీమా పథకం కొనసాగింది. నాలుగు నెలలుగా జిల్లాలో మృతి చెందిన 227 మంది రైతుల కుటుంబాలకు రూ.5లక్షల బీమా దాదాపు రూ.11 కోట్లు అందలేదు. 2024 జూలై లోపు చెల్లించాల్సిన ప్రీమియంను కొంతమేర చెల్లించి చేతులెత్తేయడం వల్లనే బీమా చెల్లింపులు నిలిచిపోయినట్లు అధికారుల ద్వారా తెలిసింది. ఇప్పటికైనా ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లించి ఏదైనా కారణంతో మృతి చెందే రైతుల కుటుంబాలకు భరోసా ఇచ్చేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

### బీమా కోసం దరఖాస్తు చేసి మూడు నెలలైంది



"తన భర్త సుందరి శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందాడు. మాకు ఐదెకరాల సాగు భూమి ఉన్నది. కేసీఆర్ సార్ రైతులకు బీమా ఇచ్చినట్లే కాంగ్రెస్ వారు కూడా ఇస్తారని మూడు నెలల క్రితం ఆన్‌లైన్ ద్వారా బీమా కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఇప్పటి వరకు రాలేదు. అధికారులను అడిగితే రేపు, మాపు అంటున్నారు... మా ఊర్లో ఇంకో ఇద్దరు, ముగ్గురికి కూడా రాలేదు. ప్రభుత్వం వెంటనే మృతి చెందిన రైతు కుటుంబాలకు బీమా సొమ్ము అందేలా చూడాలి.

**- సుందరి లింగమ్మ, గరిడేపల్లి**




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

# బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ధర్నా

భువనగిరికలెక్టరేట్, మే 27 : అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు చేపట్టాలన్నారు. రానున్న రోజుల్లో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి నేతృత్వంలో సమగ్ర కార్యాచరణ రూపొందించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ యువజన విభాగం పట్టణ అధ్యక్షులు పెంట నితీశ్, మండల అధ్యక్షులు ముల్లె నాగేంద్రబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి నాగారం సూరజ్, కంకల మహేశ్, నాయకులు ఇండ్ల శ్రీను, యాస సంతోష్‌రెడ్డి, మోత్కుపల్లి అజయ్, రొయ్యాల పవన్, తుమ్మల వినోద్, బూషపాక మనీష్, అరిగె విక్రాంత్, సురేశ్, ఉదయగిరి ఆకాశ్, రాసాల లింగస్వామి, సుమన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# ఎంజీయూ డిగ్రీ పరీక్షలో 22మంది విద్యార్థుల డిబార్


**సీవోఈ డా. ఉపేందర్‌రెడ్డి వెల్లడి**

రామగిరి, మే 27: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన 4వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 20మంది విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ డిబార్ అయినట్లు సీవోఈ డా.జి ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం జరిగిన 4వ సెమిస్టర్ పరీక్షలకు 5,090మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 4,708మంది హాజరుకాగా 369మంది గైర్హాజరుకాగా 13 మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. వీరిలో సూర్యాపేటలోని ఆర్‌కేఎల్‌కే డిగ్రీ కళాశాలలో 2, సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో 3, స్పందన డిగ్రీ కళాశాలలో 3, శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో 2, మోత్కూర్‌లోని సంతోష్ డిగ్రీ కళాశాలలో 1, మాల్‌లోని శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో 1, భువనగిరిలోని ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాలలో 1, ఆలేరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1, తిరుమలగిరిలోని ప్రగతి డిగ్రీ కళాశాలలో 1 డిబార్ అయ్యారు.మధ్యాహ్నం జరిగిన 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 1,428మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1,255మంది హాజరుకాగా 166 గైర్హాజరుకాగా 7గురు విద్యార్థులు డిబార్ అయ్యారు. వీరిలో రామన్నపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2, నల్లగొండలోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో 1, నీలగిరి డిగ్రీ కళాశాలలో 1, డీవీఎం కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో 1, భువనగిరిలోని స్టాన్‌ఫర్డ్ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో 1, భువనగిరిలోని నవభారత్ డిగ్రీ కళాశాలలో ఒకరు డిబార్ అయ్యారు.


# అరెస్టులపై ఆగ్రహం

**రాష్ట్రంలో పోలీసు రాజ్యం • ఇది కమీషన్ల పాలన**

**పెండింగ్ బిల్లులు చెల్లించాలి • మాజీ సర్పంచ్‌ల డిమాండ్**



ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా మాజీ సర్పంచులు గాంధేయ మార్గంలో హైదరాబాద్ ప్రజాభవన్ వద్ద నిరసనకు వెళ్తుంటే ఎక్కడికక్కడ ముందస్తుగా వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. రాష్ట్రంలో పోలీసుల రాజ్యం నడుస్తున్నదని మాజీ సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎంతో మంది మాజీ సర్పంచ్‌లు గ్రామాలను అందంగా తీర్చిదిద్ది అప్పులపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలో రేవంత్ సర్కార్ నిరంకుశ పాలన సాగిస్తుందని విమర్శించారు. కమీషన్ల కోసం కక్కుర్తిపడి బిల్లులు ఆపడం దారుణమన్నారు. బిల్లులు ఇవ్వనిపక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



# 298

## ప్రభుత్వ స్కూళ్లకు తాళం

**జీరో ఎన్‌రోల్‌మెంట్‌తో సర్కార్ నిర్ణయం**

**జిల్లా వ్యాప్తంగా మూతపడిన 298 ప్రభుత్వ పాఠశాలలు**

**సర్కార్ బడుల్లో ఏటా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య**

**బడిబాట నిర్వహించినా.. జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలల్లో చేరని విద్యార్థులు**

*విద్యాశాఖ అధికారుల అలసత్వం కారణంగా నల్లగొండ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు మూతబడుతున్నాయి. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి ఏడాది బడ్జెట్‌లో విద్యాభివృద్ధికి వేలకోట్ల రూపాయలు కేటాయించి ఖర్చు చేస్తున్నా ఆశించిన ఫలితం దక్కడం లేదు. జిల్లాలో 2019కి ముందు 89 పాఠశాలలను విద్యార్థులు లేరనే సాకుతో మూసివేయగా, 2025 నాటికి అవి 298కి చేరింది. ప్రతి ఏడాది బాడిబాట నిర్వహిస్తూ ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించాలని ఉపాధ్యాయులు కృషి చేస్తున్నా, తల్లిదండ్రులు చేర్పించేందుకు ముందుకు రాకపోవడానికి కారణాలు విద్యాశాఖ వైఫల్యానికి నిదర్శనం.*

రామగిరి, మే 27: ప్రభుత్వ విద్యపై ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులకు విశ్వసనీయత పెంచే విధంగా విద్యాశాఖ, ఉపాధ్యాయులు కృషి చేయాలి. కానీ నల్లగొండ జిల్లాలో పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. సర్కార్ బడులను బలోపేతం చేసే దిశగా పలు కార్యక్రమాలు ప్రవేశపెడుతున్నప్పటికీ విద్యాశాఖ అధికారుల అలసత్వంతో జిల్లా వ్యాప్తంగా 298 ప్రాథమిక పాఠశాలలు మూసివేశారు. జీరో ఎన్‌రోల్‌మెంట్‌తో పాఠశాలలు మూతపడ్డాయని అధికారులు చెబుతున్నప్పటికీ, ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో సైతం తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించడానికి ముందుకు రావడంలేదు. దీనికి గల కారణాలు తెలుసుకుని వాటిని అధిగమించేలా ప్రణాళికలు రూపొందించడంలో విఫలమవుతున్నారని పలువురు విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, తల్లిదండ్రులు విమర్శలు చేస్తున్నారు. భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో విద్యాశాఖకు వేల కోట్ల రూపాయలు కేటాయించి, ఖర్చుచేస్తున్నా ఆ శాఖ అధికారులు బాధ్యతారాహిత్యంతో సరైన ఫలితం దక్కడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నల్లగొండ జిల్లాలో 2019కి ముందు 89 పాఠశాలలు విద్యార్థులు లేరనే సాకుతో మూసివేయగా, 2025 నాటికి 298కి చేరాయి. ప్రతి సంవత్సరం బాడిబాట నిర్వహిస్తూ ప్రభుత్వ బడులలో విద్యార్థులను చేర్పించాలని ఉపాధ్యాయులు కృషి చేస్తున్నా, తల్లిదండ్రులు చేర్పించేందుకు ముందుకు రాకపోవడానికి కారణాలు విద్యాశాఖ వైఫల్యానికి దర్పణం పడుతుందని చెప్పవచ్చు.

**గ్రామీణ ప్రాంతాల్లోనే అధికం..**

మారుమూల గ్రామాలు, తండాల్లో పేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్యనందించాలనే సంకల్పంతో ప్రభుత్వం కృషి చేస్తున్నది. ఆయా ప్రాంతాల్లో పాఠశాలలకు పక్కా భవనాలు సైతం నిర్మించారు. అయితే ఆ స్కూళ్లలో ఉపాధ్యాయులు వంతుల వారీగా విధులకు హాజరవుతున్నా రనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో తమ పిల్లలకు సక్రమంగా చదువురావడం లేదని ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. విద్యాశాఖ గణాంకాల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల మూసివేతలో నల్లగొండ జిల్లా రాష్ట్రంలోనే మొదటి వరుసలో నిలిచిందని విద్యావేత్తలు అంటున్నారు.

**మూతబడిన పాఠశాలలు ఇవే..**

పెద్దఅడిశర్లపల్లి 16, గుడిపల్లి 3, పెద్దవూర 19, తిరుమలగిరి సాగర్ 17, నేరడుగొమ్ము 18, చందంపేట 36, దేవరకొండ 18, గుండపల్లి(డిండి) 17, గుర్రంపోడు 13, కొండమల్లేపల్లి 13, మిర్యాలగూడ 11, అడవిదేవులపల్లి 3, అమ్మనబోలు 3, అనుముల(హాలియా) 8, చండూరు 7, చింతపల్లి 9, చిట్యాల 3, దామరచర్ల 5, గట్టుప్పల్ 4, కనగల్ 8, కట్టంగూర్ 6, మాడ్గులపల్లి 3, మర్రిగూడ 8, మునుగోడు 6, నకిరేకల్ 2, నల్లగొండ 5, కేతేపల్లి 1, నాంపల్లి 7, నార్కట్‌పల్లి 5, నిడమనూరు 6, శాలిగౌరారం 6, తిప్పర్తి 3, త్రిపురారం 9 ఉన్నాయి.